RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 60 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 6 డిసెంబర్ 2024

# రాంకో కి అసైన్డ్ భూములు

### కేటాయించిన జగన్

### - అధికారులకు హైకోర్టు నోటీసులు



అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
నిరుపేదలకు చెందాల్సిన అసైన్డ్ భూములు జగన్ ప్రభుత్వం అక్రమంగా కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసిందంటూ నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలానికి చెందిన వంకదార చిన చెన్నప్ప హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై నేడు హైకోర్టులో వాదనలు జరిగాయి.. పిటిషనర్ తరుపున న్యాయవాది శ్రవణ్ కుమార్ తన వాదలను వినిపించారు..ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలన్న నేపంతో వందల కోట్ల విలువైన అసైన్డ్ భూమిని రాంకో సిమెంట్ పేరిట అధికారులు బదలాయించారని వాదించారు. మిగతాది 2లో...



# ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య కీలక ఒప్పందం

### టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో ఏపీ కీలక ముందడుగు

### నారా లోకేశ్ చొరవతో రాష్ట్రానికి మరింత మెరుగైన ఏఐ సాంకేతికత

### ముందుకొచ్చిన గూగుల్ కుదిరిన ఎంవోయూ

అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తొలి అడుగు వేసింది. ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టిజీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ మ్యాప్స్ ఇండియా జనరల్ మేనేజర్ లలితా రమణి, ఏపీ రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ సచివాలయంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ లివింగ్ తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అందుబాటులో ఉండే సెల్ ఫోన్ వంటి సాధనం ద్వారా ఆయా సేవలను అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మిగతాది 2లో...

# పీఎస్‌ఎల్వీ-సి59 రాకెట్ ప్రయోగం సక్సెస్...

### శాస్త్రవేత్తలను

### అభినందించిన ఇస్రో చైర్మన్

### శ్రీహరికోట నుంచి

### పీఎస్‌ఎల్వీ-సి50 ప్రయోగం

### నిర్దేశిత కక్ష్యలోకి

### ప్రోబా-3 ఉపగ్రహాలు



ఆంధ్ర ప్రగతిశ్రీహరికోట డిసెంబర్ 05:
శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం నుంచి నిర్వహించిన పీఎస్‌ఎల్వీ-సి59 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)కి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాలను పీఎస్‌ఎల్వీ-సి59 రాకెట్ అత్యంత కచ్చితత్వంతో, నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది.
ఈ ప్రయోగం సక్సెస్ అయిన నేపథ్యంలో, ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ శాస్త్రవేత్తలను అభినందించారు. సూర్యుడి బాహ్య వాతావరణం కరోనాపై ప్రోబా ఉపగ్రహాలు చేపట్టే ప్రయోగాలకు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామని వెల్లడించారు. ఎన్ఎస్ఐఎల్ భాగస్వామ్యంతో ఈ ప్రయోగం చేపట్టామని తెలిపారు. పీఎస్‌ఎల్వీ రాకెట్ సామర్థ్యానికి ఈ ప్రయోగం గీటురాయిలా నిలుస్తుందని ఇస్రో ఓ ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ అంతరిక్ష ఆవిష్కరణల రంగంలో భారత్ కీలక పాత్ర ఈ ప్రయోగం ద్వారా స్పష్టమైందని వివరించింది.

# ధాన్యం కొనుగోలులు సాఫీగా సాగాలి

### ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదు

### నిర్లక్ష్యంగాఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు

### ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు

### 1.51 లక్షల మంది రైతులకు

### రూ.2,331 కోట్ల చెల్లింపులు

### ఏపీలో ధాన్యం కొనుగోలుపై సీఎం సమీక్ష

అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
ఏపీలో ధాన్యం కొనుగోలుపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగాఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. 1.51 లక్షల మంది రైతులకు రూ. 2,331 కోట్ల చెల్లింపులు జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. గతేడాది ఈ సమయానికి.. 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 10.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం ఒక రికార్డు అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.
మిగతాది 2లో...






# విజయసాయి రెడ్డిపై లుక్ ఔట్ నోటీస్



అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసింది. ఆయనతోపాటు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో యజమాని మిగతాది 2లో...

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం

### డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్ పవార్

### సీఎంగా ప్రమాణం చేయించిన గవర్నర్ రాధాకృష్ణన్

### ముంబైలోని ఆజాద్ మైదానంలో ప్రమాణ స్వీకారోత్సవం



2లో

# రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్

అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
కృష్ణా జిల్లాలో రైతు భరోసా కేంద్రాల్లో అవకతవకలపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ ఘటనలో ఇద్దరు అధికారులు కస్టోడియల్ ఆఫీసర్, టీఏలను సస్పెండ్ చేసింది. లారీల్లో ఎక్కువ బస్తాలు ధాన్యం లోడ్ చేస్తూ..., రికార్డులలో మాత్రం తక్కువ చూపిస్తున్న వైనంపై బుధవారం మీడియా ప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి ఈ అవకతవకల ఘటనపై ఆధారాలను స్వయంగా పరిశీలించారు. రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించి..., రికార్డుల్లో మాత్రం తక్కువ చూపిస్తూ... అధికారులు - మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారంటూ రైతుల నుంచి ఆరోపణలు వచ్చాయి. రైతుల ఫిర్యాదులపై గత రాత్రి సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. రైతుల నుండి నిరంతరంగా ధాన్యం కొనుగోలు జరగాలని ఆదేశించారు. పౌరసరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసి ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా అవకతవకలు ఆధారాలను మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. శాఖపర చర్యలకు ఆదేశించారు. కస్టోడియల్ ఆఫీసర్, టీఏలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ప్రభుత్వ చర్యలతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఫిర్యాదు చేసిన రైతులకు ఎమ్మార్వోల నుంచి ఫోన్లు వెళ్లాయి. వ్యక్తిగతంగా కలిసి సమస్య పరిష్కరించుకోవాలంటూ కొందరు రైతులకు ఎమ్మార్వో ఫోన్ చేశారు. కాగా



రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ మన్‌జీర్ జిలానీ అమూన్ ఆదేశాల మేరకు అధికారులు రైసు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు, లీగల్ మెట్రాలజీ, పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక బృందాలు బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కృష్ణా జిల్లాలోని రైసు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ధాన్యం తూకాల్లో కోతలు విధిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖరీఫ్ ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. కాగా 'దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోండి. మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది. 12 గంటల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.' అని రైతులకు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గంలో తుఫాను కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన ఆయనకు మాజేరు వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన, టీడీపీ నేతలు స్వాగతం పలికారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల పరిధిలోని పాతమాజేరు, లంకపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం అడ్డరోడ్డు, చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డు, కాసానగర్, పెదప్రోలు ప్రాంతాల్లో హైవేపై దారి పొడవునా ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులున్న ప్రతిచోటా వాహనం దిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షానికి ధాన్యం తడవడం, కొద్దిమేర మొలకెత్తటం, తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబెట్టుకుంటున్నామని, తేమశాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదని, తీసుకున్నా తక్కువ ధర ఇస్తున్నారని రైతులు మంత్రికి తెలిపారు. 1262, 1224 రకం ధాన్యం కొనుగోలు చేయటంలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి గింజా ప్రభుత్వ మద్ధతు ధరకే కొనుగోలు చేస్తామని, దళారులను ప్రోత్సహించవద్దని, సమస్యలుంటే రైతుసేవా కేంద్రానికి వెళ్లాలని రైతులకు మంత్రి సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని సాయంత్రంలోగా కొనుగోలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. తేమ 24శాతం వరకూ కొనుగోలు చేయాలని ఆదేశించామన్నారు. 1262 రకం కొనుగోలుపై ఇప్పటికే మాట్లాడామని, 1224 రకం కొనుగోలులోనూ ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. మిల్లర్లు, అధికారులతో ఇబ్బందులుంటే ఆర్డీవో దృష్టికి తేవాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

# ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య కీలక ఒప్పందం

(మొదటి పేజి తరువాయి)
యువతకు ఏఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు.
గూగుల్ తో తాము చేసుకున్న ఒప్పందం ద్వారా ఏఐ రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోవడంతోపాటు యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.
పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. తాము ఏపీ ప్రభుత్వంతో కలిసి చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తు ఏఐ ఆధారిత సేవల్లో సాధికారిత సాధించడానికి ఆలంబనగా నిలుస్తాయని అన్నారు. ఏఐ ద్వారా సమాజానికి సానుకూల ప్రయోజనాలను పెంచడానికి కట్టుబడి ఉంది.

### గూగుల్ ఒప్పందంలోని కీలకాంశాలు

- విద్య, నైపుణ్యాభివృద్ధి: విద్యార్థులు, డెవలపర్లకు ఏఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10 వేల మందికి గూగుల్ ఎసెన్షియల్ పేరుతో నైపుణ్య శిక్షణ కోర్సు అందిస్తుంది. రోజువారీ జీవితంలో %ూ×%ని ఎలా ఉపయోగించాలి, ఏఐ ద్వారా ఉత్పాదకత, సామర్థ్యాన్ని పెంచడం వంటివి ఈ కోర్సులో అంతర్భాగంగా ఉంటాయి. సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ జనరేటివ్ వంటి రంగాల్లో క్లౌడ్ సర్టిఫికేషన్‌లు, స్కిల్ బ్యాడ్జ్‌లను గూగుల్ అందజేస్తుంది. ప్రభుత్వ ఏజెన్సీల కోసం స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను అందించడానికి ప్రభుత్వంతో సహకరిస్తుంది. కంప్యూటర్ సైన్స్ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అధ్యాపకులకు గూగుల్ సాంకేతిక మద్దతును అందిస్తుంది. స్కిల్లింగ్ ఇనిషియేటివ్‌లలో డెవలపర్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు, ఆండ్రాయిడ్, యాప్ స్కిల్లింగ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లకు గూగుల్ ద్వారా యాక్సెస్ లభిస్తుంది.
- స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబుల్ మెంట్: ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం, మెంటర్‌షిప్, నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడం, స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ల కోసం యాక్సెస్‌ని అందిస్తుంది. ఇందుకోసం సంస్థ ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌తో కలిసి పనిచేస్తుంది. దీంతోపాటు అర్హత కలిగిన స్టార్టప్‌లు క్లౌడ్ క్రెడిట్‌లు, సాంకేతిక శిక్షణ వ్యాపార మద్దతును పొందుతాయి.
- సుస్థిరత: గాలి నాణ్యత, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడంలో గూగుల్ ఏఐ ఆధారిత సహకారం, సేవలను అందిస్తుంది.
- హెల్త్‌కేర్: నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపర్చడం, రోగి ఆరోగ్య ఫలితాలను వేగవంతం చేయడంలో ఏఐ సేవల వినియోగానికి సహకారం అందించడం, హెల్త్ ఇమేజింగ్ మోడల్‌లకు యాక్సెస్ అందించడం, ద్వారా హెల్త్‌కేర్ ఉత్పాదకరంలో అప్లికేషన్‌లను అన్వేషించడం, హెల్త్ డెవలపర్ ఫౌండేషన్స్ ) ద్వారా పరిశోధన కార్యక్రమాలకు గూగుల్ మద్దతు ఇస్తుంది.
- పైలట్‌లు: వ్యవసాయం, ట్రాఫిక్ నిర్వహణ, వెబ్‌సైట్ ఆధునీకరణ, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో క్లౌడ్ టెక్నాలజీ, ప్రయోజనాలపై కీలక రంగాలలో పైలట్ ప్రాజెక్ట్‌లకు సహకరిస్తుంది.

# ఎఫ్ఐఆర్ లో ఏ1గా ఉండాల్సింది విక్రాంత్ రెడ్డి కాదు... జగన్ రెడ్డి: ఆనం

**కాకినాడ పోర్టు వ్యవహారంలో ఆనం వెంకటరమణారెడ్డి ప్రెస్ మీట్**

**జగన్ జేబుదొంగ అని అప్పుడే చెప్పామని వెల్లడి**

**కేవీ రావును బెదిరించడం వెనుక జగన్ ఉన్నాడని ఆరోపణ**

అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
కేవీ రావు గొంతు మీద కత్తి పెట్టి రూ. 2 వేల కోట్ల విలువైన కాకినాడ సెజ్ భూములను రూ.12 కోట్లకు, కాకినాడ సీ పోర్టులో రూ. 2,689 కోట్ల విలువైన షేర్లను రూ. 494 కోట్లకే కొట్టేసిన వైసీపీ దోపిడీ ముఠా... వారి వెనుక ఉన్న జగన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి విచారించాలని... వాస్తవాలను బయటపెట్టాలని... ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన



విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
జగన్ రెడ్డి జేబుదొంగ అని అనాడే చెప్పాం. మా మాట నాడు ఎవరూ నమ్మలేదు. నేడు ఏకంగా సీఐడీ ఛార్జ్ షీట్ ఓపెన్ చేసింది. కాకినాడ సెజ్ విస్తీర్ణం 8,320 ఎకరాల్లో ఉంది. ఈ సెజ్ పై జగన్ రెడ్డి కళ్లు పడ్డాయి. వైవీ సుబ్బారెడ్డి కొడుకు విక్రాంత్ రెడ్డి, లిక్కర్ స్కాంలో జైల్లో ఉండి వచ్చిన శరత్ రెడ్డి, విజయసాయిరెడ్డిలతో కలిసి బెదిరింపులకు దిగారు. దీంతో కేవీ రావు ఫిర్యాదుపై వారి పేర్లను ఛార్జ్ షీట్ లో పెట్టారు. కత్తులు, గన్నులు పెట్టి నాడు షేర్లు, భూములు కొట్టేసేందుకు కేవీరావును బెదిరించారు. కాకినాడ డీప్ సీ పోర్టును కైవసం చేసుకోవడానికి... శ్రీకాంత్ రెడ్డి, శరత్ రెడ్డిని జగన్ రెడ్డి రంగంలోను దింపి పీకేఎఫ్ శ్రీధరన్ సంతానం అనే ఆడిట్ సంస్థ, క్రోల్ ఇండియా అనే ఆడిట్ సంస్థలతో 28 రోజులు అక్రమ ఆడిట్ చేయించి.. ప్రభుత్వానికి రూ. 1000 కోట్లు కట్టాలని కేవీ రావును బెదిరించారు. ఒకే కంపెనీని ఇద్దరు కన్సెల్టెంట్లతో ఆడిట్ చేసి ఒత్తిడి తెచ్చారు. రూ. 1000 కోట్లు కట్టకుంటే కేసులు పెడతామని బెదిరించి సీ పోర్టులో వాటాల బదిలీకి డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోర్టును స్వాధీనం చేసుకుంటామని భయపెట్టారు. షిప్పింగ్ ఏజెంట్ లను కూడా భయపెట్టారు. చివరకు కేవీ రావు గొంతు మీద కత్తి పెట్టి 41% శాతం వాటాను కొట్టేశారు. అసలు చెన్నై నుండి ఆడిటర్లు ఇక్కడకు వచ్చి ఆడిట్ చేయడం ఏంటి? ఏపీలో ఆడిటర్ లు లేరా? ప్రభుత్వం ఆడిట్ చేయవచ్చు కదా?
ఈ కేసులో ఎఫ్ఐఆర్ లో ఏ1 గా ఉండాల్సింది విక్రాంత్ రెడ్డి కాదు... జగన్ రెడ్డి. కర్త కర్మ క్రియ అన్ని కూడా జగన్ రెడ్డినే. డీజీపీ, సీఐడీ దీన్ని గుర్తించి జగన్ రెడ్డిని ఏ1 గా నమోదు చేయాలి... అని ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.

## రాంకో కి అసైన్డ్ భూములు

రాంకో సిమెంట్ పేరిట బదలాయించిన భూమి ఇప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమి గానే నమోదయిందని వివరించారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల లో ఉన్న మొత్తం 1926 ఎకరాల భూమిని పేదప్రజలకు అసైన్మెంట్ చేసి మరుక్షణమే రాంకో సిమెంట్ పేరిట రెవెన్యూ , రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు బదాలాయించేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. తన వాదనను సమర్థిస్తూ 900 పేజీల ఆధారాలు హైకోర్టు సమర్పించారు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్.వేలాది అసైన్మెంట్ ఎకరాలు పేద ప్రజలను మోసం చేస్తూ కేటాయింపులు జరగకుండానే కార్పొరేట్ సంస్థలకు బదలాయించటం చట్ట విరుద్ధం అని అన్నారు.. కాగా, న్యాయవాది శ్రవణ్ కుమార్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం తక్షణమే రామ్ కో సిమెంట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. అలాగే ప్రిన్సిపల్ సెక్రెటరీ పంచాయతీరాజ్, రెవిన్యూ మరియు జిల్లా కలెక్టర్ ను కౌంటర్ దాఖలు చేయవలసిందిగా కోరింది.. తదుపరి విచారణను మూడు వారాలు వాయిదా వేసింది.

# విజయసాయి రెడ్డిపై లుక్ ఔట్ నోటీస్

(మొదటి పేజి తరువాయి)
శరత్ చంద్ర రెడ్డిపై ఎల్వోసీ ఇచ్చింది. ఈ ముగ్గురూ విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగా ఈ సర్క్యూలర్ జారీ చేసింది. కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్, కాకినాడ సెజ్‌లోని రూ. 3,600 కోట్ల విలువైన వాటాలను కర్నాటి వెంకటేశ్వరరావు, కేవీ రావు నుంచి గత ప్రభుత్వ హాయంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో కీలక నిందితులుగా వీరున్నారు. వాటాలు రాసివ్వకపోతే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని కేవీ రావును బెదిరించి, భయపెట్టి అత్యధిక షేర్లను అరబిందో సంస్థ సొంతం చేసుకుందనేది ప్రధాన అభియోగం.దీనిపై కేవీ రావు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో విజయసాయిరెడ్డి, విక్రాంత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి.. ఈ ముగ్గురు కీలక నిందితులుగా ఉన్నారు. కేవీ రావు స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేస్తున్నారు. విక్రాంత్ రెడ్డిపై ఇప్పటికే సీఐడీ గురిపెట్టింది. కేవీ రావుతోపాటు మరికొందరి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. అధికారులు కేసు రిజిష్టర్ చేసిన వెంటనే లుకౌట్ నోటీసులుజారీ చేశారు. ఈ ముగ్గురు విదేశాలకు పారిపోకుండా దేశంలో ఉన్న అన్ని విమానాశ్రయాలకు ఎల్వోసీలు పంపినట్లు సీఐడీ అధికారులు పేర్కొన్నారు. వారిని విచారించేందుకు త్వరలో నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం...

**హాజరైన ప్రధాని, ఏపీ సీఎం, కేంద్రమంత్రులు**



ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేశారు. శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. వారితో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఫడ్నవీస్ మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదానంలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, ఏపీ సీఎం చంద్రబాబు, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ సహా ఎన్డీయే పాలిత రాష్ట్రాల నుంచి 19 మంది సీఎంలు హాజరయ్యారు.

# ధాన్యం కొనుగోలులు సాఫీగా సాగాలి

(మొదటి పేజి తరువాయి)
భవిష్యత్తులోనూ రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. వరి కోతలకు ఎక్కువగా యంత్రాలు ఉపయోగిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ధాన్యం మిల్లులకు రావడంతో రద్దీ ఎక్కువైంది. తేమ శాతంలో గందరగోళం ఏర్పడింది. నిబంధనల ప్రకారం తేమ శాతం 17 అయితే.. దీనికి మరో 5 శాతం కలిపి రైతులకు మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని మిల్లర్లను ప్రభుత్వం ఆదేశించింది. రైతులను ఇబ్బంది పెట్టే దళారులపై చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించింది. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల కంకిపాడు మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ, నగదు చెల్లింపు ప్రక్రియపై రైతులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ అవస్థలను మంత్రికి వివరించారు. మిల్లర్లు, వ్యాపారులు కుమ్మక్కై ధాన్యం ధరను తగ్గిస్తున్నారని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. తేమ నెపంతో మద్దతు ధర కంటే మూడు వందల మేర తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై ఏపీ ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. వికేంద్రీకరణ విధానంలో రైతు సేవా, ధాన్యం సేకరణ కేంద్రాలు, ఈ- పంట, ఈకేవైసీ ద్వారా కొనుగోళ్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కామన్ వెరైటీ ధాన్యం కనీస మద్దతు ధర రూ.2,300, గ్రేడ్ ఏ రకం కనీస మద్దతు రూ.2,320 చెల్లించాలని స్పష్టం చేసింది. ఖరీఫ్ సీజన్‌లో 37లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రేషన్ అక్రమాలపై ఎట్టిపరిస్థితుల్లో వెనక్కి తగ్గొద్దు

**పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పీడీ యాక్ట్ కింద కేసులు**

**పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

**కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష**



అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05::పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నాదెండ్ల కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా రేషన్ బియ్యం విషయంలో అక్రమాలపై ఎట్టిపరిస్థితుల్లో వెనక్కి తగ్గొద్దని అధికారులకు సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై నేర తీవ్రతను బట్టి పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 6(ఏ) కేసులు, సీజ్ చేసే విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. అలాగే జిల్లాల్లో ధాన్యం సేకరణ, సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇక ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## పరిశ్రమలు వస్తేనే కరువు ప్రాంతాలు అభివృద్ధి చెందేది

### -ఆర్ఎస్యు రాష్ట్ర కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 5:
రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ కర్నూలు జిల్లా 10.వ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు టెక్నాలజీ ఈ రోజుల్లో ప్రతి మనిషికి సెల్ ఫోన్ అనేది ఒక బాడీ పార్ట్ గా తయారైందని దాని నుంచి వచ్చే టెక్నాలజీ మంచికి చెడుకు 60 శాతం చెడు కే ఉపయోగపడుతుందని తెలిపారు కర్నూలు జిల్లా వెనకబడిన ప్రాంతమని ఇక్కడ ప్రతి సంవత్సరం 4 లక్షల మంది ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవన ఉపాధి కల్పించుకుంటారు కావున ఈ ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని పరిశ్రమలు తీసుకురావాలని అన్ని విధాలుగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగర అధ్యక్షులు అనకల శ్యాంప్రసాద్ లెక్చరేర్ నరహరి ఆర్ఎస్ యు నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ మధుసూదనరావుకు ప్రతిష్టాత్మక ఐఎంఏ జాతీయ జీవితకాల సాఫల్య పురస్కారం.!



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 05:
భారతీయ వైద్య సంఘం ప్రతిఏటా నిర్వహించే జాతీయ మహాసభల సందర్భంగా ఇచ్చే పురస్కారాలలో భాగంగా, దేశంలో ఒక వైద్యునికి అందించే ఐఎంఏ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు (జీవితకాల సాఫల్య పురస్కారం) ఈ సంవత్సరం నంద్యాలకు చెందిన ప్రముఖ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావును అవార్డ్స్ కమిటీ ఎంపిక చేసిందని ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి అనిల్ నాయక్ ఢిల్లీ కేంద్ర కార్యాలయం నుండి రాష్ట్ర ఐఎంఏ శాఖకు సందేశం పంపించారు. డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావు గత మూడు దశాబ్దాలకు పైగా నంద్యాల ప్రాంతంలో చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులుగా చేస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, ప్రతి ఏటా గత 17 సంవత్సరాలుగా దేశంలోని యువ ఈ ఎన్ టీ వైద్యులకు ప్రత్యక్ష శస్త్ర చికిత్సల కార్యశాల నిర్వహించి శిక్షణ ఇస్తున్నారని అవార్డ్స్ కమిటీ ఎంపిక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఏటా గత 30 సంవత్సరాలుగా ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నారని,అదే విధంగా సామాజిక, కళా సేవలు విస్తృతంగా చేస్తున్నారని ప్రశంసించారు. ఈ అవార్డు ను డిసెంబర్ 27,28 వ తేదిలలో హైదరాబాద్ లో నిర్వహించ నున్న 99 జాతీయ మహా సభలలో అందచేసి సత్కరిస్తారు.ఐఎంఏ ప్రతిఏటా జాతీయ మహాసభల సందర్భంగా నలుగురిని దేశవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ వైద్యుల నుండి విశిష్ట పురస్కారాల కోసం ఎంపిక చేస్తారు. వాటిలో రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు డాక్టర్ మధుసూదనరావుకు, గతవారం ప్రకటించిన సామాజిక సేవలకు అందించే డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూలి స్మారక పురస్కారం డాక్టర్ రవి కృష్ణ ఎంపిక కావడం, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన వైద్యులు కావడం విశేషమని ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఐఎంఏ నంద్యాల వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

## నాగరాజు కుటుంబ సమస్యలు
## పోలీసులు పరిష్కరించి రక్షణ కల్పించాలి



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 05:
నంద్యాల పట్టణంలో ఎన్జీవో కాలనీ లో నివసిస్తున్న నాగరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకోకుండా కాపాడవలసిన బాధ్యత పోలీసు అధికారుల పైన ఉన్నదని వెంటనే నాగరాజు కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించి వారిసమస్యను పరిష్కరించాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలో గతంలో అబ్దుల్ సలాం కుటుంబము పోలీస్ అధికారాలు నిర్లక్ష్యంతోనే ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని. అదే విధంగా మున్సిపాలిటీ కార్మికుడు అధిక వడ్డీలు కట్టలేక పోలీసులు ఆశ్రయించిన పట్టించుకోకపోవడంలతో ఆత్మహత్యగా చేసుకోవడం జరిగింది అని ఇదే తరహాలో కొంతమంది పట్టణ ప్రజలు ప్రభుత్వ పోలీస్ అధికారులకు సమస్యలు పరిష్కరించాలని చెప్పి ప్రభుత్వానికి తెలియజేసిన ఏమాత్రం పట్టించుకోకపోవడంతో వారు తమ బాధలు ఎవరు చెప్పుకోలేక తీవ్రంగా కృంగిపోతున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ నిర్మిస్తున్న ప్రజావేదిక లో ప్రజలకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని అదేవిధంగా జిల్లా పోలీస్ అధికారిఎస్పీ కార్యాలయంలో జరుగుతున్న పరిష్కార వేదికలు కూడా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరి ఉన్నాయని జిల్లా ఉన్నతాధికారులు సమస్యలు పరిష్కరించాలని కింది స్థాయి పంపిన కిందిస్థాయి అధికారులు నిమ్మకు నీరొచ్చినట్టు ఉండడం వల్లే ప్రజలు ఇలా ఆత్మహత్యలు వైపే శరణ్యం అంటున్నారని ఇప్పటికైనా జిల్లా అధికారులు ఆర్యవైశ్య నాగరాజు కుటుంబంసమస్యను వెంటనే పరిష్కరించి వారిని ఆదుకోవాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

## కడపకు డిప్యూటీ సీఎం పవన్..



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 7వ తేదీన కడప జిల్లాలో పర్యటించనున్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ లో జరిగే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి హోదాలో తొలిసారి పర్యటనకు వస్తుండటంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అభిమానుల తాకిడి లేకుండా పెద్దయెత్తున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

## తిరుపతి నుంచి తొలి అంతర్జాతీయ విమాన సర్వీసు..

తిరుపతిఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05:
తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషితో తిరుపతి విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు ప్రైవేట్ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో తిరుపతి విమానాశ్రయం నుంచి శుక్రవారం ఉదయం 5 గంటలకు తొలి అంతర్జాతీయ విమానం సింగపూర్‌కు బయలుదేరనుంది. ఈ మేరకు ఎయిర్‌పోర్టు అధారిటీ అధికారికంగా ప్రకటించింది.

# బెడ బుడగజంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలి

### -ఏపీ ప్రభుత్వ ప్రతిపాధనను ఆమోదించాలి.
### -కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ కు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 05:
బెడ బుడగ జంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని ఢిల్లీ లో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని బేడ బుడగ జంగం కులం చారిత్రాత్మకంగా అట్టడుగున ఉన్న సమూహం అని, కేంద్ర స్థాయిలో షెడ్యూల్డ్ కులాల (SC) జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉన్నందన్నారు.
బేడ బుడగ జంగం కులం ఒక సంచార సమాజం, మానవ శాస్త్ర, సాంస్కృతిక లక్షణాలలో విభిన్నమైనదని. వీరి పూర్వీకులు జీవనోపాధి కోసం వివిధ సరిహద్దు ప్రాంతాలకు వలస వచ్చారని. శతాబ్దాలుగా, వారు జానపద కళలను ప్రదర్శిస్తున్నారని , కానీ వారి సంచార జీవనశైలి కారణంగా, వారు ఏ నిర్దిష్ట గ్రామ సమాజంలో కలిసిపోలేదన్నారు. ఇది సామాజిక హోదా, ఆర్థిక శక్తి లేదా రాజకీయ ప్రాతినిధ్యం లేని తీవ్ర దుర్బలమైన స్థితిలో సమాజాన్ని వదిలివేసిందని. సమాజం విద్యలో వెనుకబడి అత్యంత పేదరికంలో ఉందని. వారి కష్టాలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్



ప్రభుత్వం బెడ బుడగ జంగం కులస్థులకు న్యాయం చేసేందుకు నిబద్ధతతో కృషి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2019, 2023లో ఆ వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు ఆమోదం తెలుపుతూ, వారి రిజర్వేషన్ హక్కులను పరిష్కరిస్తూ తీర్మానం చేసిందని కేంద్రమంత్రి కి వివరించారు . సంఘం యొక్క ఎథ్నోగ్రాఫిక్ అధ్యయనాలు దీనికి మద్దతు ఇచ్చాయని, ప్రత్యేకించి, 06-10-2023 నాటి ఉత్తరం నం. 7297/SW-CV/2008 ద్వారా ఇటీవలి ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి పంపబడింది, దీని కింద 61లోని ప్రాంతీయ భేదాల చట్టం 2002 సవరణ కోసం ఒక నివేదిక సమర్పించబడింది. బెడ బుడగ జంగం కులానికి షెడ్యూల్డ్ రిజర్వేషన్ హక్కులు కల్పించండని . అయినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో ఈ ప్రయత్నాలు ఆమోదాలు ఉన్నప్పటికీ, సంఘం ఇప్పటికీ భారత ప్రభుత్వం నుండి తుది ఆమోదం కోసం వేచి ఉందన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించి, బెడ బుడగ జంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చే హక్కును కల్పిస్తూ నిర్ణయం తీకుకుంటారని, ఈ చేరిక ఈ సమాజం ఎదుర్కొంటున్న చారిత్రక అన్యాయాలను సరిదిద్దడమే కాకుండా, తరతరాలుగా కష్టాలు అనుభవిస్తున్న ఈ సంచార దళితుల జీవితాల్లో వెలుగులు నింపడంతోపాటు వారికి అవసరమైన సామాజిక మరియు ఆర్థిక అభ్యున్నతిని కూడా అందిస్తుందని . బెడ బుడగ జంగం కులస్థులకు న్యాయం జరగాలని, వారి రాజ్యాంగ హక్కులు ఎట్టకేలకు పునరుద్ధరింపబడాలని నా ప్రగాఢ ఆశ అని, ఈ విషయంలో అవసరమైన చర్యను వేగవంతం చేయాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనను ఆమోదించవలసిందిగా నేను మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభ్యర్థిస్తున్నానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## పండుగ వాతావరణంలో నిర్వహించే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వానం

**-ప్రజా ప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పుర ప్రముఖులు, గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ఆహ్వానం.**

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 05:
ఈనెల 7వ తేదీ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో నిర్వహించే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భారీ సమావేశానికి ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పుర ప్రముఖులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 995 ప్రాథమిక పాఠశాలలు, 110 ప్రాథమికోన్నత పాఠశాలలు, 294 ఉన్నత పాఠశాలలు వెరసి మొత్తము 1399 పాఠశాలల్లో పెద్ద ఎత్తున మెగా ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలతో అందరినీ ఆహ్వానించడం జరిగిందన్నారు. పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 1.54 లక్షల మంది విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాల



ప్రగతితో పాటు, విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యం, ఆటలు, క్రీడలు లాంటి విన్యాసాలలో ప్రావీణ్యత, తోటి విద్యార్థులతో ప్రవర్తన, భావవ్యక్తీకరణ, పరస్పర సహకారం, నాయకత్వ లక్షణాలు తదితర విషయాలన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి సమావేశంలో చర్చించేలా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులో దాగి వున్న ప్రతిభను గుర్తించి ఆ మేరకు శిక్షణ ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ప్రతి విద్యార్థి యొక్క ఆరోగ్యానికి కూడా పరీక్షించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సంబంధిత విషయాలను కూడా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 31 పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో కూడా స్క్రీన్ టెస్ట్ లు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. అదే రీతిలో పాఠశాలలకు కూడా గ్రేడింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారి సలహాలు, సహకారం తీసుకొని పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో హాజరైన ఆహ్వానితులందరికీ శుభదిన్ భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ 7వ తేదీన పండుగ వాతావరణంలో నిర్వహించుకొనే మెగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భారీ సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## ఏజాస్ అహ్మద్ టీచర్ పై దాడిచేసి హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

**-ఉపాధ్యాయులకు దిక్కెవరు...**
**ప్రభుత్వమే రక్షణ కల్పించాలి..!**
**-అపుస్మా జిల్లా అధ్యక్షులు బిజ్జం.సుబ్బారెడ్డి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 05:
అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రాంతంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిపట్ల విద్యార్థులు వ్యవహరించిన తీరు దారుణమని, ఈ విచారకర సంఘటనను ఖండిస్తున్నామని నంద్యాల జిల్లా ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి అన్నారు. అపుస్మా నంద్యాల జిల్లా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిజ్జం మాట్లాడుతూ అనునిత్యం విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు తీసుకెళ్లాలని తపించే ఉపాధ్యాయులకు జరుగుతున్న పరిణామాలకు దిక్కెవరన్నారు. పరబ్రహ్మ స్వరూపమైన గురువుకు విద్యార్థులను సరైన మార్గంలో ఉంచాలని దండిస్తే రాక్షసుడు అంటారు, లేకపోతే దండగమారోడు అంటారు నిర్ణయం ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నామని అన్నారు. విద్యార్థులను శిక్షించే క్రమంలో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే రకరకాల సంఘాల నుంచి వచ్చే విమర్శలు దాడులు ప్రభుత్వ అధికారుల ఒత్తిళ్లతో బిక్కు బిక్కుమంటూ వృత్తిలో కొనసాగుతున్నామన్నారు. ఓవైపు కుటుంబ ఒత్తిళ్ళు, ఆరోగ్య ఆర్థిక ఒత్తిళ్ళు ఉన్నప్పటికీ గౌరవ మర్యాదలకోసం వృత్తిలో కొనసాగుతూ విద్యార్థి ఎదుగుదలే తన ప్రపంచంగా భావిస్తున్న ఉపాధ్యాయులకు రక్షణ కరువైందన్నారు. కావున ప్రభుత్వం ఈ అంశంలో పునరాలోచించాలని కోరారు. విద్యావ్యవస్థపై ఉపాధ్యాయుల విధి విధానాలపై విద్యార్థి సంఘాలు చూపుతున్న మరియు చేస్తున్న దుష్ప్రచారాలు వ్యతిరేఖతలే ఈ పరిస్థితులకు కారణాలన్నారు. చదువురాని, ప్రతిభ లేని, దుర్వ్యాసనాలకుగురై జీవనం కొనసాగిస్తున్న కొన్ని నకిలీ విద్యార్థి సంఘాలనాయకులు గురువుల పట్ల సామాజికంగా ప్రతికూలతలు వ్యక్తం చేసి విద్యార్థుల్లో నెగెటివ్ భావాలు, నిర్లక్షపు భావాలు రావడానికి ప్రధాన కారకులని బిజ్జం అన్నారు. ఇప్పటికైనా ఈ కూటమి ప్రభుత్వ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు, విద్యాసంస్థలకు చట్టబద్ధత రూపంలో రక్షణ చర్యలు చేపట్టాలని బిజ్జం అభ్యర్థించారు. అలాగే ఉపాధ్యాయుడి మరణంపై ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లాలో ఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకుల మరియు మేధావి సంఘాల నాయకుల సంఘీభావంతో మద్దతు కోరుతూ రేపు విద్యాసంస్థలు బంద్ ప్రకటించాలనికోరుతున్నాం. ఈ సమావేశంలో జిల్లా సెక్రటరీ భాస్కర్, ట్రెజరర్ హుస్సేన్ భాషా పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా

# క్షుణ్ణంగా వాహనాల తనిఖీలు.!

-గడచిన రెండు రోజులలో రోడ్డు భద్రతా నిబంధన ఉల్లంఘనలపై 910 కేసులు 5,08,395/- జరిమాన.

-ఓపెన్ డ్రింకింగ్ పై 116 కేసులు, డ్రంకన్ డ్రైవ్ కింద 37 కేసుల నమోదు 36 వాహనాలు స్వాదినం.

-నాటు సారాయి,అక్రమ మధ్యం పై కేసు నమోదు 50 లీటర్లు సారాయి,17 (180) ఎంఎల్ బాటిల్లు స్వాదినం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 05: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ నేరానివారనే లక్షంగా విజిబుల్ పోలిసింగ్,ఎన్ఫోస్మెంట్ పనులు జరగాలని ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలో అన్నీ పోలీసు స్టేషన్ పరిదులలో ప్రతి రోజు పోలీసు అదికారులు సదరు కార్యక్రమాలను నిర్వహించడం జరిగుతుంది ఈ కార్యక్రమంలో భాగంగా గత రెండు రోజులలో మట్కా,జూదము,అక్రమ మధ్యం, డ్రంకన్ %డ% డ్రైవ్,రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ విహికల్ అక్ట్ ను కట్టుదిట్టంగా అమలు చెయ్యడంతో పాటు విశ్రు త తనిఖీలు నిర్వహించడం జరిగింది చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో పోలీసు అదికారులు వారి సిబ్బంది సహాయంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టగా మొత్తం 37 కేసులు నమోదు చేసి 36 వాహనాలు సీజ్ చెయ్యడం జరిగింది. ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా 116 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయడం జరిగింది.జిల్లాలో మోటార్ వెహికల్ చట్టం అమలుచేస్తు 910 కేసులు నమోదు చేసి 5,08,395/- రూపాయలను జరిమాన విదించడం జరిగింది.డోన్ సబ్ డివిజన్ పరిదిలో పేకాట ఆడుచున్న వారిపై దాడి చేసి కేసులు నమోదు చెయ్యడంతో పాటు 05 మందిని అరెస్ట్ చేసి 5720/- రూపాయలను స్వాదినం చేసుకోవడం జరిగింది.జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ పనులలో భాగంగా జిల్లా పోలీసు అదికారులు నాటు సారా స్థావరాలపై మరియు అక్రమ మధ్యం విక్రయదారులపై దాడి చేసి కేసులు నమోదు చెయ్యడంతోపాటు 50 లీటర్ల నాటు సారాయి,17 (180 ఎంఎల్) అక్రమ మధ్యం బాటిళ్లను స్వాదినం చేసుకోవడం జరిగింది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ ల వద్ద

# ప్రమాద సూచికల ఏర్పాటు.

-వేగంగా ప్రయాణించి ప్రమాదాల బారిన పడవద్దు. -పాణ్యం ఇన్స్పెక్టర్ వి.కిరణ్ కుమార్.






ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 05: నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకునే చర్యలలో భాగంగా జిల్లా ఎస్పీ అజరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల టు కర్నూలు మధ్యగల జాతీయ రహదారి లో పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాల నివారణకు పాణ్యం ఇన్స్పెక్టర్ గారు హైవే అథారిటీ వారి సహకారంతో ప్రమాద సూచికలను మరియు కాషన్ బోర్డ్స్ లను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రిపూట కల్వర్టు కనిపించే విధంగా కల్వర్టుపై రేడియం స్టిక్కర్లను కూడా అతికించడం జరిగింది.

### కాషన్ బోర్డ్స్ మరియు సైన్ బోర్డ్స్ వలన కలిగే ప్రయోజనాలు

1.రహదారి భద్రత: ట్రాఫిక్ సైన్ బోర్డ్స్ రహదారి భద్రతను పెంచుతాయి మరియు వాహనాలు ఎలా నడపాలి, ఎక్కడ ఆపాలి, ఎలా తిరగాలి అనే విషయాలపై స్పష్టమైన సమాచారాన్ని అందిస్తాయి.

2.ప్రమాదాల నివారణ: కాషన్ బోర్డ్స్ ప్రమాదాలను నివారించడంలో సహాయపడతాయి మరియు వాహనాలు జాగ్రత్తగా నడపడానికి మరియు ప్రమాదాలను నివారించడానికి సహాయపడతాయి మరియు ప్రజల అవగాహనను పెంచుతాయి.

ఈ కార్యాక్రమంలో పాణ్యం ఇన్స్పెక్టర్ వి.కిరణ్ కుమార్ తో పాటు ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో పోలవరం ప్రాజెక్ట్ను సందర్శిస్తా..

## చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరం నిర్మాణ పనులు వేగవంతం

## కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి



అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05: చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరం నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. త్వరలో పోలవరం ప్రాజెక్ట్ను సందర్శిస్తానని కేంద్రమంత్రి తెలిపారు. పోలవరం నిర్మాణానికి ఇప్పటికే చాలా నిధులను అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన సొమ్మును తిరిగి చెల్లిస్తున్నామన్నారు. పోలవరం నిర్మాణానికి ఇప్పటికే చాలా నిధులను అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన సొమ్మును తిరిగి చెల్లిస్తున్నామన్నారు. ఢిల్లీలో గృహప్రవేశం సందర్భంగా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మీడియా ప్రతినిధులకు గురువారం విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో పోలవరం ప్రాజెక్ట్పై కేంద్రిమంత్రి ఈమేరకు ప్రకటన చేశారు. దీంతో పోలవరం ప్రాజెక్ట్పై కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి జీవనాడి లాంటిదని.. దీనిని 2027 నాటికి పూర్తిచేస్తామని ఢిల్లీలో కేంద్రమంత్రి తెలిపారు. కాగా జనవరి నుంచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభంకాబోతోంది. దీన్ని 2026 మార్చి కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు సాగుతున్నాయి. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 70వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. గోదావరి -కృష్ణా- పెన్నా నదుల అనుసంధానం కూడా ఉండబోతోంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగాయి. అయితే రివర్స్ టెంటర్ కారణంగా పదిహేడు నెలల పాటు నిలిచిపోయాయి. జగన్ పాలనలో ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగని పరిస్థితి. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 71.93శాతం 2014-2019 మధ్య టీడీపీ హయాంలో పూర్తి అయితే.. ఆ తరువాత ప్రభుత్వ హయాంలో కేవలం 3.84 శాతం మాత్రమే పూర్తి అయ్యాయని పార్లమెంటులో గణాంకాలను అందజేశారు.

2024-25లో రూ.12,500 కోట్లు నిధులపై కేంద్రం దృష్టిసారించింది. ఈ నిధులతో డయాఫ్రంవాల్తో పాటు పలు కీలకమైన పనులను పూర్తి చేయనున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయితే గోదావరి -కృష్ణా- పెన్నా నదుల అనుసంధానం కూడా పూర్తి అవుతుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదనేది కేంద్రం మాట. పాత డయాఫ్రం వాల్ నష్టపోవడంతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.1200 కోట్లు అవసరం అవుతాయని కేంద్రం అంచనా వేసింది. అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కోసం రూ.31,500 కోట్లు అవసరం అవుతాయని సర్కార్ నిర్ణయించింది. దాన్ని కూడా ఇచ్చేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. వరదల సమయంలో నీటి లీకేజ్ ప్రధాన సమస్యగా ఉండటంతో దీనికి నూతన సాంకేతికతను ఉపయోగించనున్నారు. 2019- 24 మధ్య వైసీపీ హయాంలో ప్రాజెక్ట్ నిధులు సరైన విధంగా వినియోగించలేదని విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 7.2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే కాకుండా 28.5 లక్షల మందికి తాగు నీరు అందుతుంది. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కేంద్రం ప్రయారిటీగా భావిస్తోంది.

# తక్కువ ధరకే అమ్ముకొని రైతులు మోసపోవద్దు

### ప్రతి గింజ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

### మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, పార్థసారథి వెల్లడి

అమరావతి ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05: జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్ , పార్థసారథి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. ధాన్యం తేమ శాతం 17% నుంచి 25% వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. బయట తక్కువ ధరకే అమ్ముకొని రైతులు మోసపోవద్దన్నారు. రైతుల దగ్గర్నుంచి ప్రతి గింజ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. మిల్లర్లు ఎవరైనా సరే తేమ శాతం ఎక్కువ ఉందని రైతులను ఇబ్బంది పెడితే రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాల్లో వారితో పాటు మిల్లర్లు కూడా ఒకళ్ళు అందుబాటులో ఉండాలన్నారు. తేమశాతం పరిశీలించి ఫైనల్ చేయాలని సూచించారు. గత వైసీపీ హయాంలో ధాన్యం కొనుగోలు చేసిన ఆరు ఏడు నెలలకు గాని డబ్బులు రైతులు ఎకౌంట్లో పడేవి కాదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు వస్తున్నామని మంత్రి పార్థసారథి వెల్లడించారు. వర్షాలకు రైతులు కొంతమంది ఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం హయంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా పంట కొనుగోలు చేస్తున్నామన్నారు. మిల్లర్లు అవకతవకలు చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. రైతులెవరు నష్టపోవద్దని.. ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన ఆరు ఏడు నెలలకు కూడా డబ్బులు పడతాయో లేదో తెలిసేది కాదన్నారు. వైసీపీ పార్టీ నాయకులు బ్రోకర్లు అవతారమెత్తి రైతులను మోసం చేశారని నక్కా ఆనంద్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గంలో పట్టపగలే లైట్లు వెలుగుతుండడంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా పగటి పూట విద్యుత్ దీపాలు వెలగడాన్ని ఫోటోలు తీసి పంపిస్తున్నారని తెలిపారు. విద్యుత్ను అవసరాల మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్ను వృథా చేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పగటి పూట కూడా విద్యుత్ దీపాలు వెలగడంతో సంస్థపై భారం పడుతోందన్నారు. పగటిపూట వీధి దీపాలు వెలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలంటూ ఉన్నతాధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు.

## కేంద్ర సాయుధ బలగాల్లో

# భారీగా ఉద్యోగ ఖాళీలు

### సీఏపీఎఫ్ బలగాల్లో లక్షకుపైగా ఉద్యోగాలు
### యూపీఎస్సీ, ఎస్ఎస్సీ ద్వారా నియామకాలు
### ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు సత్వర చర్యలు
### రాజ్యసభలో కేంద్రమంత్రి నిత్యానంద రాయ్ వెల్లడి



న్యూఢిల్లీ, ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05: కేంద్ర సాయుధ బలగాలు, అస్సాం రైఫిల్స్ లో లక్షకు పైనే ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. గత ఐదేళ్లలో దాదాపు 71,231 పోస్టులు భర్తీ చేసినట్లు కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానంలో బుధవారం వెల్లడించారు. ఖాళీగా ఉన్న సీఏపీఎఫ్, ఏఆర్ ఉద్యోగాల్లో చాలా వరకు పదవీ విరమణ, రాజీనామాలు, పదోన్నతులు, మరణాలు, కొత్త బెటాలియన్ ఏర్పాటు, కొత్త పోస్టులను సృష్టించడం వంటి వాటివల్ల ఏర్పడినట్లు తెలిపారు. విభాగాల వారీగా ఖాళీలు పరిశీలిస్తే.. అక్టోబర్ 30 నాటికి సీఏపీఎఫ్, ఏఆర్లో మొత్తంగా 1,00,204 పోస్టులు ఖాళీగా ఉన్నాయి . అందులో అత్యధికంగా సీఆర్పీఎఫ్లో 33,730 పోస్టులు, సీఐఎస్ఎఫ్లో 31,782 పోస్టులు, బీఎస్ఎఫ్లో 12,808 పోస్టులు, ఐటీబీపీలో 9,861 పోస్టులు, ఎస్ఎస్బీలో 8,646 పోస్టులు, అస్సాం రైఫిల్స్లో 3377 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ ద్వారా ఈ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు వైద్య పరీక్షలకు సంబంధించి సమయాన్ని తగ్గించడం, కానిస్టేబుల్ జీడీ కోసం షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థుల కటాఫ్ మార్కులను తగ్గించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇక కేంద్ర సాయుధ బలగాల్లో పనిచేసే సిబ్బంది శ్రేయస్సుకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీఏపీఎఫ్ సిబ్బందికి ఏడాదిలో 100 రోజులు వారంతా కుటుంబంతో గడిపేలా మంత్రిత్వశాఖ కృషిచేస్తోందని తెలిపారు. 2020 నుంచి 2024 అక్టోబర్ వరకు 42,797 మంది సీఏపీఎఫ్, ఏఆర్ సిబ్బంది 100 రోజుల సెలవులు వినియోగించుకున్నట్లు ఆయన వెల్లడించారు.

..................

# ప్రయాణికులకు తీపికబురు చెప్పిన రైల్వే

### జనరల్ బోగీలను పెంచనున్న సౌత్ సెంట్రల్ రైల్వే

న్యూఢిల్లీ, ఆంధ్ర ప్రగతి డిసెంబర్ 05: ఎక్స్ప్రెస్, సూపర్ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను దశలవారీగా పెంచుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రెండే జనరల్ కోచ్ లు ఉన్న రైళ్లలో ఆ సంఖ్యను నాలుగుకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. అవి కూడా ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఎల్.హెచ్.బి కోచ్ లు ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. జోన్ పరిధిలోని 21 జతల రైళ్లకు అదనగా 80 ఎల్.హెచ్.బి బోగీలను అందుబాటులోకి తీసుకొస్తామన్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు. రైళ్లలో పేదలు ప్రయాణించే జనరల్ బోగీల రూపం కూడా మారబోతున్నది. ఇన్నాళ్లు రైళ్లలో పాతకాలం నాటి సాధారణ బోగీలే ఉన్నాయి. చాలా రైళ్లలో రెండే బోగీలు ఉండటంతో పేద ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాని కారణంగా జనరల్ బోగీల సంఖ్యను పెంచేందుకు రైల్వేబోర్డు కార్యాచరణ ప్రారంభించింది. కొత్తగా వస్తున్న జనరల్ బోగీలను ఎల్.హెచ్.బి పరిజ్ఞానంతో తయారుచేసినవి ప్రవేశ పెడుతున్నారు. పాత తరం ఐసీఎఫ్ బోగీల్లో 90 సీట్లు ఉంటే.. ఎల్.హెచ్.బి బోగీల్లో సీట్ల సంఖ్య 100 ఉంటాయి. ఇందులో ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు సైతం తక్కువ నష్టం ఉంటుందంటున్న రైల్వే అధికారులు. ఏసీ, స్లీపర్ క్లాస్ లలో మాత్రమే ఎల్.హెచ్.బి బోగీలను రైల్వే శాఖ ప్రవేశపెడుతూ వచ్చింది. కానీ తాజాగా ఇప్పుడు జనరల్ క్లాస్ లలో ఎల్.హెచ్.బి కోచ్ లను అందుబాటులోకి ఇస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే. ఇప్పటికే జోన్ పరిధిలో 19 ఎక్స్ ప్రెస్ రైళ్లకు ఎల్.హెచ్.బి కోచ్లను 66 కోచ్లను ప్రవేశపెట్టారు. గౌతమి, దక్షిణ్, నారాయణాద్రి తదితర ఎక్స్ప్రెస్ రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి జనరల్ కోచ్ లు వచ్చాయి. రైల్వేశాఖ దేశవ్యాప్తంగా 370 రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి బోగీలను దశలవారీగా జత చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఫలితంగా రోజూ అదనంగా 70 వేల మంది ప్రయాణికులు జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు ఆస్కారం ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.